- మేడ్చల్‌లో ఎంఈవోగా.. వికారాబాద్ జిల్లాలో ఇన్‌చార్జిగా..
- మేడ్చల్ జిల్లా బాలానగర్ ఎంఈవోగా పోస్టింగ్
- పరిగి, పూడూరు, దోమ మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోగా కొనసాగింపు
- 90 కిలోమీటర్ల దూరంలోని మండలాలకు అదనపు బాధ్యతలు అప్పగించడంపై విమర్శల వెల్లువ
- పాఠశాలల పర్యవేక్షణను గాలికొదిలిన సర్కారు

విద్యాశాఖలో.. వింతలెన్నో!

పరిగి, సెప్టెంబర్ 13 : సాధారణంగా సంబంధిత అధికారి లేకుంటే అక్కడే పని చేసే మరో సీనియర్‌కు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగిస్తారు...మండల స్థాయి అధికారులైతే పక్క మండలం అధికారిని నియమిస్తారు. కానీ, 90 కిలోమీటర్ల దూరంలోని మండలాలకు ఓ ఆఫీసర్‌కు ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు అప్పగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ సర్కార్ పాఠశాలల పర్యవేక్షణకు గాలికొదిలేసిందని చెప్పేందుకు ప్రత్యక్ష నిదర్శనం ఈ వార్త కథనం.. వివరాల్లోకి వెళ్తే.. 19 ఏండ్లుగా దోమ మండల విద్యాధికారిగా పనిచేస్తున్న హరిశ్చంద్ర గత మూడేండ్లుగా పరిగి, పూడూరు మండలాల ఇన్‌చార్జి ఎంఈవోగానూ కొనసాగుతున్నారు. అయితే.. జూలై 30న ఆయన మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలోని బాలానగర్ మండల విద్యాధికారిగా బదిలీ అయి.. జూలై 31న పదవీబాధ్యతలూ చేపట్టారు. అనంతరం కూకట్‌పల్లి ఎంఈవోగానూ అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే హరిశ్చంద్ర బాలానగర్ ఎంఈవోగా బదిలీపై వెళ్లిన తర్వాత అతడి స్థానంలో దోమ, పరిగి, పూడూరు మండలాలకు ఇప్పటివరకు ఇన్‌చార్జి ఎంఈవోలను అధికారులు నియమించలేదు. ఈ మూడు మండలాలకు ఇప్పటికీ ఆయన్నే ఇన్‌చార్జి ఎంఈవోగా కొనసాగించడం విడ్డూరం. వికారాబాద్ నుంచి రంగారెడ్డి జిల్లా దాటిన తర్వాత ఉన్న మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలోని బాలానగర్‌లో ఎంఈవోగా పనిచేస్తున్న హరిశ్చంద్రను పరిగి, దోమ, పూడూరు మండలాల ఇన్‌చార్జి ఎంఈవోగా కొనసాగించడంలో ఉన్న ఔచిత్యమేమిటని విద్యాశాఖ ఉన్నతాధికారులను పలువురు ప్రశ్నిస్తున్నారు. బాలానగర్ నుంచి పరిగి 90 కిలోమీటర్లు, దోమ మండల కేంద్రం 100 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ నేపథ్యంలో రెండు జిల్లాలు దాటి వికారాబాద్ జిల్లాలోని మూడు మండలాల ఇన్‌చార్జి బాధ్యతలు ఆయన ఎలా పర్యవేక్షిస్తారని, దోమ నుంచి హరిశ్చంద్ర బదిలీ అయి దాదాపు నెల రోజులు దాటినా ఇప్పటివరకు ఎందుకు ఇన్‌చార్జిలను నియమించలేదని ప్రశ్నిస్తున్నారు.

సమర్థులైన వారు లేరా ?

వికారాబాద్ జిల్లాలోని పరిగి, దోమ, పూడూరు మండలాల ఇన్‌చార్జి ఎంఈవోలుగా పనిచేసేందుకు సమర్థులైన వారు లేరా..? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఇన్‌చార్జి ఎంఈవోలను నియమించాలి

ప్రభుత్వం స్పందించి మూడు మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోలను నియమించాలి. కోర్టు కేసులు ఉన్నాయనే సాకుతో పర్యవేక్షణాధికారులను నియమించకుంటే విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతుంది. రెండు నుంచి ఐదు మండలాలకు ఒకే ఎంఈవోను ఇన్‌చార్జిగా కొనసాగిస్తే పర్యవేక్షణ కొరవడుతుంది.

–సత్యనారాయణరెడ్డి, టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

పరిగి మండలంలో 44 ప్రాథమిక పాఠశాలలు, 8 యూపీఎస్‌లు, 11 ఉన్నత పాఠశాలలుండగా సుమారు 6,200 మంది చదువుతున్నారు. అదేవిధంగా పూడూరు మండలంలో 37 ప్రాథమిక పాఠశాలలు, 4 యూపీఎస్‌లు, 12 ఉన్నత పాఠశాలల్లో సుమారు 3,600 పైచిలుకు, దోమ మండలంలో 52 ప్రాథమిక పాఠశాలలు, 8 యూపీఎస్‌లు, 10 ఉన్నత పాఠశాలల్లో సుమారు 5,700 పైచిలుకు మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. దీంతోపాటు ప్రైవేట్ స్కూళ్లు, కేజీబీవీలు, గురుకులాలు, మోడల్ స్కూళ్లను ఎంఈవోలు పర్యవేక్షిస్తారని..నెల రోజులకు పైగా మూడు మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోను నియమించకపోవడం తగదని పలువురు పేర్కొంటున్నారు.

పరిగి పట్టణంలో మూడు ఉన్నత పాఠశాలలున్నాయి. ఇక్కడ సీనియర్ ఉపాధ్యాయులు జీహెచ్‌ఎంలుగా కొనసాగుతున్నారు. బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏకంగా డీఈవోకు గురువు. ఆయన గతంలో పూడూరు ఇన్‌చార్జి ఎంఈవోగానూ పనిచేశారు. పూడూరు, దోమ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా సీనియర్లు కొనసాగుతున్నారు. పైన పేర్కొన వారికి అదనపు బాధ్యతగా ఇన్‌చార్జి ఎంఈవోలు నియమిస్తే స్థానికంగా పాఠశాలల పర్యవేక్షణ బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు. జిల్లాలోని పరిగి, దోమ, పూడూరు మండలాలను మిన హాయిస్తే మిగతా మండలాల్లో జీహెచ్‌ఎంలే ఇన్‌చార్జి ఎంఈవోలుగా కొనసాగుతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు మూడు మండలాలలకు ఇన్‌చార్జి ఎంఈవోలను నియమించి పాఠశాలల పర్యవేక్షణను బలోపేతం చేయాలని పలువురు విద్యాభిమానులు సూచిస్తున్నారు.

ప్రజా పాలన దినోత్సవాన్ని రంగారెడ్డి కలెక్టర్ శశాంక ఘనంగా నిర్వహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. ఈ నెల 17న నిర్వహించే ప్రజాపాలన దినోత్సవ ఏర్పాట్లపై శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 17న తెలంగాణ ప్రజాపాలన కార్యక్రమాన్ని రంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించేందుకు శాఖల వారీగా కేటాయించిన పనులను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్వో సంగీత, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి రామారావు, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర రావు, సీపీవో సౌమ్య, వివిధ శాఖల అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

వికారాబాద్ జిల్లా ఫారెస్ట్ అధికారి, మండల ప్రత్యేకాధికారి జ్ఞానేశ్వర్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఫారెస్ట్ అధికారి, మండల ప్రత్యేకాధికారి జ్ఞానేశ్వర్

కొడంగల్, సెప్టెంబర్ 13 : సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులు పరిష్కరించాలని వికారాబాద్ జిల్లా ఫారెస్ట్ అధికారి, మండల ప్రత్యేకాధికారి జ్ఞానేశ్వర్ సూచించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సమావేశం జరిగింది. ముందుగా ఆయా శాఖల అధికారులు తమ తమ ప్రగతి నివేదికలను మీటింగ్‌లో వివరించారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ మండలంలో 1,882 మంది రుణమాఫీకి అర్హులు కాగా.. అందులో ఇప్పటివరకు 1,376 మందికే మాఫీ వర్తించిందన్నారు. భారీ వర్షాలతో 183 మంది రైతులకు చెందిన 191 ఎకరాల 35 గుంటల్లో పంట నష్టం జరిగిందన్నారు. స్త్రీశక్తి రుణాలు అందించడంలో జిల్లా స్థాయిలో కొడంగల్ మూడో స్థానంలో ఉందని ఏపీఎం వెంకన్న తెలిపారు. ఎంఈవో రాంరెడ్డి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన బియ్యం పంపిణీకి రవాణా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, కొన్ని స్కూళ్లకు మాత్రమే బియ్యం రవాణా అవుతున్నదని..మిగిలిన పాఠశాలల ఉపాధ్యాయులు సొంత ఖర్చులతో బియ్యాన్ని తీసుకెళ్తున్నారన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత బాలుర, బాలికల పాఠశాలలకు రోడ్డు సౌకర్యం లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని.. పాఠశాలలకు పూర్తి స్థాయి ప్రహరీ లేని కారణంగా పందుల బెడద అధికంగా ఉన్నదని సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. ఇరిగేషన్ డీఈ రవికిరణ్ మాట్లాడుతూ మండలంలోని చెరువులు, కుంటలు ప్రస్తుత వర్షాలకు నీటితో నిండి కొన్ని చోట్ల లీకేజీకి గురవుతున్నట్లు తెలిపారు. కాగా లీకేజీలను పూడ్చేందుకు కావాల్సిన మొరాన్ని అటవీ నుంచి తరలించడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వారు అనుమతిస్తే సౌకర్యంగా ఉంటుందన్నారు. అనంతరం మండల ప్రత్యేకాధికారి మాట్లాడుతూ సీఎం నియోజకవర్గం కాబట్టి అధికారులు బాధ్యతాయుతంగా ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో ఉషశ్రీ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

డ్రోన్ల సంచారంపై చర్యలు తీసుకోండి

హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ ఠాణాలో ఫిర్యాదు చేసిన పలు గ్రామాల రైతులు

హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ ఠాణాలో ఫిర్యాదు చేస్తున్న రైతులు

యాచారం, సెప్టెంబర్ 13 : మండలంలో రాత్రిపూట ఇండ్లు, పంట పొలాలు, పశువులు, గొర్రెల మందల మీదుగా సంచరిస్తున్న డ్రోన్లపై చర్యలు తీసుకోవాలని మేడిపల్లి, నానక్‌నగర్ గ్రామాలకు చెందిన పలువురు రైతులు శుక్రవారం హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండలంలో గత వారం రోజులుగా చింతపట్ల, మొండిగౌరెల్లి, మేడిపల్లి, యాచారం, నానక్‌నగర్, తక్కళ్లపల్లి తదితర గ్రామాల్లో ఏకకాలంలో ఐదారు డ్రోన్లు సంచరిస్తుండడంతో గ్రామాలవాసులు ఆందోళన చెందుతున్న విషయం తెలిసిందే. ప్రభుత్వం భూముల సేకరణ కోసం సర్వే పనులు చేపట్టితే ఉద యం పూట చేయాలి కాని, రాత్రి పూట చేయడమేంటని ప్రశ్నించారు. రహస్యంగా డ్రోన్లు తిరుగుతుండడం పలు అనుమానాలకు తావిస్తున్నదన్నారు. డ్రోన్లను ఎవరు.. ఎక్కడి నుంచి.. ఎందు కోసం ఆపరేట్ చేస్తున్నారో పూర్తిస్థాయిలో విచారణ జరిపి వారి పై చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతులు కాన మోని గణేశ్, మహిపాల్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, ముత్యా లు, పుల్లయ్య, మహేశ్ ఉన్నారు.

ఐదు గ్యారెంటీల అమలు అంతే..

- ఉన్న పథకాలే సక్రమంగా కొనసాగడం లేదు
- హామీల అమల్లో ప్రభుత్వం విఫలం
- చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి ఎద్దేవా

సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

బంట్వారం, సెప్టెంబర్ 13 : రేవంత్ ప్రభుత్వం ఉత్తమాటలు చెప్పేందుకే ఉన్నదని.. ఉన్న పథకాలనే సక్రమంగా కొనసాగించడంలేదని.. ఇక ఐదు గ్యారెంటీల సంగతి అంతేనని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొనసాగిన పథకాలను కూడా ఈ ప్రభుత్వం సక్రమంగా కొనసాగించలేక పోతున్నదని, హామీల అమల్లో విఫలమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉపాధి హామీ పథకం నిధులను ఈ సర్కారు పక్కాదారి పట్టించి ఇతర అవసరాలను వాడుకుంటున్నదన్నారు. యుటిలిటీ సర్టిఫికెట్ ఇస్తే మలి దశ నిధులు విడుదలయ్యే అవకాశం ఉందన్నారు. ఎంపీ లాడ్స్, ఎన్ఆర్ఈజీఎస్ నిధులను తీసుకొచ్చి చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేద్దామనుకున్నానని.. ఈ ప్రభుత్వ నిర్వాకంతో కేవలం ఎంపీ ల్యాడ్స్‌ను మాత్రమే ఉపయోగించుకోవాల్సి వస్తున్నదన్నారు. మండలంలోని చాలా రోడ్లు గుంతలమయంగా మారాయని.. వాటిని ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద నిధులు తీసుకొచ్చి మరమ్మతులు చేయిస్తానని హామీఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ కో–ఆర్డినేటర్ నందు, తాండూరు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్, మాజీ ఎంపీటీసీ శ్రీకాంత్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మహేశ్ యాదవ్, నాయకులు వెంకటేశ్‌గౌడ్, సుదర్శన్‌రెడ్డి, శరణరెడ్డి, మల్లేశం, నాగరాజ్, రాజు, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో మెరిసిన గురుకుల విద్యార్థులు

రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 12న జరిగిన రంగారెడ్డి జిల్లా అథ్లెటిక్ మీట్–2024లో మున్సిపల్ పరిధి పాతకొడంగల్‌లోని గిరిజన గురుకుల విద్యార్థులు ప్రతిభను చాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. షాట్‌పుట్‌లో అంగోత్ ప్రవీణ్ (ఇంటర్ ప్రథమ మొదటి) జిల్లా స్థాయిలో మొదటి స్థానాన్ని, డిస్కస్‌త్రోలో రెండో స్థానాన్ని సాధించగా.. వికాస్ (9వతరగతి) లాంగ్ జంప్, బ్యాక్‌త్రో, రన్నింగ్‌లో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో.. అదేవిధంగా నేనావత్ రమేశ్(7వ తరగతి) ఖోఖో విభాగంలో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచాడు. పై ముగ్గురు విద్యార్థులు బంగారు పతకాలను సాధించడం చాలా ఆనందంగా ఉందని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారిని అధ్యాపకులతో కలిసి ఆయన అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

-కొడంగల్, సెప్టెంబర్ 13

గణేశ్ శోభాయాత్రకు విద్యుత్తు శాఖ సిద్ధం

సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

సిటీబ్యూరో, సెప్టెంబర్ 13(నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్‌లో 17న నిర్వహించిన గణనాథుల శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ అన్ని ఏర్పాట్లు చేసిందని సీఎండీ ముషారఫ్ ఫరూఖీ అన్నారు. హుస్సేన్‌సాగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్తు శాఖ శుక్రవారం ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను ఆయన ప్రారంభించారు. నిమజ్జనం సందర్భంగా అవసరమయ్యే విద్యుత్తు అదనపు లోడ్‌కు సరిపోయేలా 500 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు 3చ, 315 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు 31, 160 కేవీఏ సామర్థ్యంతో కూడిన ట్రాన్స్‌ఫార్మర్లను 37 వరకు ఏర్పాటు చేశామన్నారు. 55 కి.మీ 11 కేవీ ఎల్ టీ కేబుల్స్‌ను, పోల్స్‌ను ఏర్పాటు చేశామని, సూపరింటెండెంట్ ఇంజినీర్లు, డివిజినల్ ఇంజినీర్లు క్షేత్ర స్థాయిలో ఉండి పర్యవేక్షిస్తారన్నారు. గణేశ్ మండప నిర్వాహకులు, ప్రజలు విద్యుతు భద్రతా సూచనలు పాటిస్తూ ఎక్కడైనా అవాంఛనీయ పరిస్థితులు ఏర్పడితే విద్యుత్తు శాఖ కంట్రోల్ రూమ్ నంబరుకు లేదా 100, 1912లకు కాల్ చేసి తెలియజేయాలని సీఎండీ ముషారఫ్ ఫరూఖీ సూచించారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకుందాం

ఆర్కేపురం, సెప్టెంబర్ 13: ఆపదలో ఉన్నవారిని ఆదుకుందాం, ఆదుకోవడం అనేది మనసున్న ప్రతి ఒక్కరి బాధ్యత అని గ్రేటర్ ఈస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ నరసింహారావు అన్నారు. ఖమ్మం, ములుగు, నల్గొండ వరద బాధితులకు పంపిణీ చేసేందుకు రూ.20 లక్షల విలువైన నిత్యావసర సరుకులు, దుస్తులు, చిన్నారుల ఆటవస్తువులను గ్రేటర్ ఈస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్కేపురం డివిజన్ వాసవీకాలనీలోని అష్టలక్ష్మి ఆలయ ప్రాంగణం నుంచి డీసీఎంలో తరలించే వాహనానికి ఆయన జెండా ఊపి ప్రారంభించారు.

ప్రయాణికులకు ఇబ్బందులుండొద్దు

క్షేత్రస్థాయి పర్యటనలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

సిటీబ్యూరో, సెప్టెంబర్ 13(నమస్తే తెలంగాణ): చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు వెళ్లే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట అధికారులను ఆదేశించారు. కమిషనర్ కాప్రా సర్కిల్ చర్లపల్లిలో జోనల్ కమిషనర్ టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులతో శుక్రవారం కలిసి పరిశీలన చేశారు. చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు అనుసంధానంగా ఉన్న అన్ని రోడ్లను కమిషనర్ పరిశీలించారు.

ఇప్పటికే దెబ్బతిన్న రోడ్లను వెడల్పు చేసి రోడ్డు వేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆటవీ శాఖ నుంచి వెడల్పు రహదారి ప్రతిపాదించారు. టెర్మినల్‌కు చుట్టూ పటిష్టమైన రహదారి ఏర్పాటుకు అవసరమైన భూమిని సేకరించాలన్నారు. టెర్మినల్ చుట్టూ ఉన్న అప్రోచ్ రోడ్డు టీజీఐఐసీకి సంబంధించిన భూమి ఉన్నందున వారు సహకారంతో టెర్మినల్ చుట్టూ రోడ్డు మార్గం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ వెంట ఎల్బీ నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎస్ఈ అశోక్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక చేయూత : జీహెచ్‌ఎంసీ

కుట్టు మిషన్ కేంద్రం ప్రారంభోత్సవం

సిటీబ్యూరో, సెప్టెంబర్ 13(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళలకు ఆర్థిక, సామాజికంగా ప్రగతి సాధించే దిశగా ముందుకు పోతున్నట్లు మేయర్ విజయలక్ష్మి తెలిపారు. బాలానగర్‌కు చెందిన సహారా గ్రూప్ సభ్యులకు కుట్టు మిషన్ కేంద్రాన్ని శుక్రవారం ఏర్పాటు చేసి రూ.4 లక్షల ఆర్థిక సహాయాన్ని ఆమె పంపిణీ చేశారు. గ్రేటర్‌లో సుమారు 47,960 స్వయం సహాయక సంఘాలలో 4, 47,631 మహిళలు సభ్యులుగా ఉన్నారని మేయర్ పేర్కొన్నారు. ఇందిరా మహిళా శక్తి 7000 ఎంటర్‌ప్రైజెస్‌లను గ్రూపులకు, వ్యక్తిగత మహిళలకు మొత్తం రూ. 410 కోట్ల ఈ ఆర్థిక సంవత్సరంలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మైక్రో క్రెడిట్ ద్వారా ఇప్పటికే 1718 గ్రూపులకు రూ.186.25 కోట్ల ఆర్థిక సహాయం అందజేసినట్లు మేయర్ తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (యూసీడీ) చంద్రకాంత్ రెడ్డి, జోనల్ కమిషనర్ రవి కిరణ్, యూసీడీ అధికారులు, సహారా గ్రూప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

బొంరాస్‌పేట, సెప్టెంబర్ 13 : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ శివారులో శుక్రవారం 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ అబ్దుల్‌రవూఫ్ తెలిపారు. ఉదయం 9 గంటల ప్రాంతంలో నాగిరెడ్డిపల్లి–దేవనూరు రోడ్డులో వాహనాల తనిఖీల్లో భాగంగా మహీంద్రా వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 25 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. తాండూరుకు చెందిన వాహన యజమాని, డ్రైవర్ బోయ రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వృత్తి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

షాబాద్, సెప్టెంబర్ 13 : వృత్తి శిక్షణ ఇచ్చి ఉద్యోగ కల్పనకు కృషి చేస్తామని, అందుకు అర్హులైన మైనారిటీస్(ముస్లిం, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీకులు) దరఖాస్తు చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి నవీన్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. (ఐటీ, ఎడ్యుకేషన్, హెల్త్, అకౌంటింగ్, వెటర్నరీ, డెయిరీ, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యుటీషియన్, హార్టికల్చర్, టూరిజం, హాస్పిటాలిటీ, డ్రైవింగ్, ఎలక్ట్రానిక్స్ తదితర అంశాల్లో శిక్షణ ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు తమ దరఖాస్తులను నిర్ణీత ఫార్మాట్‌లో VC, MD, TGMFC, కార్యాలయం, 5వ అంతస్తు, హజ్‌హౌస్, రజాక్ మంజిల్, నాంపల్లిలో అక్టోబర్ 4వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు సమర్పించాలన్నారు.

5జీ, 6జీ హ్యాకథాన్..

సిటీబ్యూరో, సెప్టెంబర్ 13(నమస్తే తెలంగాణ): టెలీ కమ్యూనికేషన్ టెక్నాలజీలో ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు టీ హబ్ ఆధ్వర్యంలో 5జీ, 6జీ హ్యాకథాన్‌ను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. వరల్డ్ టెలీ కమ్యూనికేషన్ స్టాండర్డైజేషన్ అసెంబ్లీ (డబ్ల్యూటీఎస్) అవుట్ రీచ్ ప్రోగ్రామ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వ సమాచార శాఖ, డిపార్టుమెంట్ ఆఫ్ టెలీకాం, భారత్ 6జీ అలయెన్స్‌లతో కలిసి 5జీ, 6జీ హ్యాకథాన్‌ను నిర్వహిస్తున్నామని, ఈ నెల 15వ తేదీ లోగా ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఈ నెల 26, 27వ తేదీల్లో హ్యాకథాన్ ఉంటుందన్నారు.

సైకో కిల్లర్ దంపతులకు యావజ్జీవకారాగార శిక్ష

తీర్పుఇచ్చిన రంగారెడ్డి జిల్లా మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి పట్టాభి రామారావు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, సెప్టెంబర్13 (నమస్తే తెలంగాణ): అమాయకురాలైన ఒంటరి మహిళను భార్య సాయంతో లైంగిక దాడి జరిపి హత్యచేసిన నిందితులైన కురువ స్వామి అలియాస్ రవి, కురువ నర్సమ్మలకు యావజ్జీవ కారాగార శిక్ష, మూడువందల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి పట్టాభి రామారావు తీర్పునిచ్చారు. అదనపు పీపీ రాజిరెడ్డి కథనం ప్రకారం.. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలంలోని జనగాం గ్రామానికి చెందిన కురవ స్వామి అదే జిల్లాకు చెందిన నర్సమ్మతో కలిసి ఐడీఏబొల్లారంలోని వైఎస్సార్‌కాలనీలో ఉండేవాడు.

కూలీ పనులు చేస్తూ జీవించేవారు. 2021 జూలై 25న దుండిగల్ పరిధిలోని మల్లంపేట లేబర్ అడ్డాకు వచ్చిన ఓ మహిళకు వారు పని ఉందని చెప్పి బైక్‌పై జిన్నారం మండలం మంత్రికుంట గ్రామపరిధిలోని నిర్జీవ ప్రదేశానికి తీసుకెళ్లి లైంగిక దాడి చేసి, హత్య చేశారు. నగదు, బంగారు నగలను తీసుకెళ్లారు. ఆ మహిళ సాయంత్రమైనా తిరిగి ఇంటికి రాక పోవడంతో ఆమె కుమారుడు దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించారు.

విచారణలో భాగంగా రవి, నర్సమ్మలకు పోలీసులు అదుపులోకి తీసుకోగా చేసిన నేరాన్ని అంగీకరించారు. వారిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు తదుపరి దర్యాప్తు నిర్వహించి కోర్టులో పలు సాంకేతిక ఆధారాలతో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. సైబరాబాద్ లైజన్ ఆఫీసర్ శివారెడ్డి కోర్టులో సాక్ష్యాలను ప్రవేశపెట్టగా పరిశీలించిన న్యాయస్థానం శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

మరో కేసులో పదేండ్లు..

శంకర్‌పల్లి పరిధిలో సింగాపురంలోని కల్లు కాంపౌండ్‌లో కల్లు తాగుతున్న మరో ఒంటరి మహిళను స్వామి అలియాస్ రవి, నర్సమ్మ టార్గెట్ చేశారు. ఆమెను 2021 జూ లై 29న వారి బైక్‌పై బుల్కాపూర్ అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి లైంగిక చేసి..గొంతునులుమగా సదరు మహిళ అపస్మారకస్థితికి చేరగా.. మృతి చెందిందని భావించి.. ఆమె వద్ద ఉన్న నగదు, బంగారాన్ని తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాసేపటికే ఆ మహిళా మేల్కొని శంకర్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి.. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జ్‌షీట్‌ను దాఖలు చేయగా.. జడ్జి పదేండ్ల జైలుశిక్ష, జరిమానా విధించారు.